క్లుప్తంగా

నిత్యం వెలుగులు



పగలు వెలుగుతున్న విద్యుత్ లైట్

విడవలూరు : మండలంలోని జాస్‌పేట గ్రామంలో వీధి దీపాలు పగలు, రాత్రి అని తేడా లేకుండా నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీని వల్ల లైట్లు త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. అంతేకాకుండా పంచాయతీలపై విద్యుత్ బిల్లుల భారంతో పాటు విద్యుత్ వృథా అవుతోంది. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

కుంకాళమ్మ ఆలయ అర్చకుడు మృతి



శ్రీనివాసులుశర్మ

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కొలువైన కుంకాళమ్మ ఆలయ అర్చకుడు పోగుల శ్రీనివాసులుశర్మ(58) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వెంకటాచలం : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. శ్రీకాకుళానికి చెందిన కృష్ణ(47) చెముడుగుంట వద్దనున్న రైస్ మిల్లులో పనిచేస్తున్నారు. పనినిమిత్తం నెల్లూరుకు వెళ్లి తిరిగి ఆటోలో చెముడుగుంటకు వచ్చారు. రైసు మిల్లుకు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



హైవేపై డ్రమ్ములను ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై

మనుబోలు : వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని ఎస్సై శివరాకేష్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణకు మండల పరిధిలోని జాతీయ రహదారిపై పలుచోట్ల ఆదివారం రేడియం స్టిక్కర్లతో ఉన్న డ్రమ్ములను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించడం లాంటివి తరచూ ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. ఈ క్రమంలో ప్రమాదాల నివారణకు హైవేపై సున్నితమైన ప్రదేశాలైన పోర్టు క్రాస్‌రోడ్డు, బద్దెవోలు క్రాస్ రోడ్డు, కాగితాలపూరు క్రాస్‌రోడ్డు, వీరంపల్లి క్రాస్ తదితర చోట్ల వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రేడియం స్టిక్కర్లతో ఉన్న డ్రమ్ములను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

గ్రామ సేవలకు మంగళం

- సచివాలయాల్లో అందని కీలక సేవలు
- సంక్షేమ పథకాల ఊసేలేదు
- కూటమి సర్కార్ నిర్ణయంతో ప్రజలకు ఇక్కట్లు



గుండాలమ్మపాళెంలోని గ్రామ సచివాలయం

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారు. పట్టణాల్లో వార్డు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు అత్యుత్తమ స్థాయి సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేయడంతో పాటు వలంటీర్‌లు ప్రతిఇంటికీ వెళ్లి సేవలు అందించారు. నేటి కూటమి సర్కారు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఎన్నికల హామీలకు హ్యాండిచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు సైతం మంగళం పాడేలా వ్యవహరిస్తోంది. ఒకవైపు వలంటీర్‌లను తొలగించి ఇంటి ముంగిట సేవలకు ఫుల్‌స్టాప్ పెట్టగా, సచివాలయ ఉద్యోగులకు గౌరవం లేకుండా కించపరిచేలా విధులను అప్పగిస్తూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజలకు సచివాలయాల్లో అందే సేవలన్నీ నిలిచిపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

545 రకాల సేవలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రూపుదిద్ది ప్రజలకు 545 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు ప్రజలకు నిత్యం అవసరమైన సేవలను ఇంటి ముంగిటకే తెచ్చారు. ఒక్క కొడవలూరు మండలంలోనే 16 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించారు. ఈ సచివాలయాల్లో 150 ఉద్యోగులతో పాటు 250 మందికిపైగా వలంటీర్‌లు ప్రజలకు సేవలందించడంలో నిమగ్నమయ్యేవారు.

అర్హులందరికీ పథకాలు

గత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రజల నుంచి నిత్యం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు సచివాలయాలు పనిచేస్తూ ఉండేవి. సామాజిక పింఛన్‌లు, నివేశన స్థలాలు, బియ్యం కార్డులు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆటో వాలాలకు వాహనమిత్ర ఇలా పదుల సంఖ్యలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తూ అర్హులకు పథకాలందించడంలో కీలకపాత్ర పోషించేవి. ఆయా సచివాలయాల పరిధిలో ఏ పథకాన్ని ఎంత మందికి ఎంత సొమ్ము చెల్లించామనే వివరాలను స్పష్టంగా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టి మరీ ప్రదర్శించేవారు. కానీ ఇప్పుడు అవి మచ్చుకకు సైతం కనిపించని దుస్థితి నెలకొంది.

ప్రజల ఆగ్రహం

సచివాలయ ఉద్యోగులతోనే సామాజిక పింఛన్‌లు పంపిణీ చేయించడం, ఇది మంచి ప్రభుత్వమంటూ ప్రచారం చేయడం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తప్ప మరి ఏ పథకానికి సంబంధించిన దరఖాస్తులు చేయడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అత్యవసరమైన రేషన్ కార్డులు కానీ నూతన పింఛన్‌లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివేశన స్థలాలు తదితర పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ సైట్స్ ఓపెన్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

సచివాలయ సేవలను పునరుద్ధరించాలి



గత ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా వందలాది సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. వలంటీర్‌లతో ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలను అందించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల్లో సేవలేమీ అందించడం లేదు. ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉన్న సచివాలయాలను నిర్వీర్యం చేయడం సబబు కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు కొనసాగించాలి.

– ఎం.మల్లికార్జున, వెంకన్నపురం, కొడవలూరు మండలం

పూర్తిస్థాయిలో సేవలందించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడిచినా సంక్షేమ పథకాల ఊసే లేదు. సచివాలయాల ద్వారా గత ప్రభుత్వం అందించిన సేవలను సైతం నిలిపి వేయడంతో అసలు సంక్షేమ పథకాలు ఇస్తారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రజలకు నిత్యావసరమైన రేషన్ కార్డుల్లో మార్పులు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్‌లు, కొత్తగా నివేశన స్థలాలకు దరఖాస్తు పెట్టుకునే అవకాశం కల్పించాలి. ప్రజలకందే మెరుగైన సేవలకు ఆటంకం కలిగించకుండా సచివాలయాల ద్వారా గతంలో ఉన్నట్లు పూర్తిస్థాయి సేవలందించాలని కోరుకుంటున్నాం.

– జడ్డా సాయికుమార్, యల్లాయపాళెం, కొడవలూరు మండలం

కాశీ విశ్వేశ్వరునికి మహాసంప్రోక్షణ



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

మనుబోలు : మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో అన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు కోటేశ్వరరావు విశ్వేశ్వరునికి గణపతి పూజ, స్వస్తి పుణ్యావచనం, రుద్రహోమం, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, కలశ పూజలను చేశారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమాలకు పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు.

రూ.15 లక్షలకు బెల్టు షాపు

- నేలటూరు పట్టపుపాళెంలో వేలంపాట



నేలటూరు పట్టపుపాళెం

ముత్తుకూరు, నెల్లూరు : ముత్తుకూరు మండలం, నేలటూరు పంచాయతీలోని పట్టపుపాళెంలో మద్యం బెల్టు షాపునకు వేలంలో రూ.15 లక్షలకు పలికింది. ఇటీవల జరిగిన వేలంపాటలో స్థానిక టీడీపీ వర్గీయులు ఇక్కడి బెల్టు షాపును ఈ మొత్తానికి చేజిక్కించుకున్నారు. నేలటూరు ప్రధాన గ్రామంలో ఏర్పాటైన లైసెన్సు మద్యం షాపునకు ఈ బెల్టు షాపు బ్రాంచ్‌గా పనిచేస్తుంది. స్థానిక వ్యాపారస్తులు వేలం రూపంలో చెల్లించే రూ.15 లక్షలను గ్రామం కోసం ఖర్చు చేస్తారు. దీనిని ప్రతి నాలుగు మాసాలకు రూ.5 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. పట్టపుపాళెంలో సుమారు 500 కుటుంబాలున్నాయి. ఈ పాళెంలో చదువుకున్న యువకులు సమీపంలోని థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తుండగా, అత్యధిక కుటుంబాలు సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వేలంలో రూ.15 లక్షలకు బెల్టు షాపు సొంతం చేసుకొన్నారంటే ఇక్కడ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గండవరం హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

కొడవలూరు : మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్లో 1995–96 పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలిశారు. 28 సంవత్సరాల తరువాత ఎక్కడెక్కడో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా ఒకచోట కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఎంతో ఆనందంగా గడిపారు. ఒకరికొకరు హత్తుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం స్నేహితులంతా కలిసి భోజనం చేసి సంతోషంగా గడిపారు. ఇంతటి మధురానుభూతులు గతంలో ఎప్పుడూ పొందలేని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. ప్రతి ఏడాది ఇలాగే పూర్వ స్నేహితులంతా కలవాలని నిర్ణయించుకొన్నట్లు స్పష్టం చేశారు. చివరగా అప్పటి ఉపాధ్యాయులు, ట్యూషన్ టీచర్‌లను సన్మానించారు.

ఇంటింటా జ్ఞానజ్యోతి వెలగాలి



పొట్లపూడిలో ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత- ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక సభ్యులు

తోటపల్లిగూడూరు : వచ్చే దీపావళిని పురస్కరించుకుని ప్రతి ఇంట్లో జ్ఞాన జ్యోతి వెలుగులు నింపాలని త్రైత సిద్ధాంత- ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సూరమాళి అన్నారు. మండలంలోని విలుకానుపల్లి, సౌత్‌ఆములూరు, పొట్లపూడి, కొత్తపాళెం, కోడూరు గ్రామాల్లో భగవద్గీతతో పాటు వంద అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సూరమాళి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలన్నారు. హిందూవులు విధిగా దీపావళి రోజున తమ ఇళ్లల్లో దీపాలను వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత- ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యులు ప్రదీప్, నరసింహ ప్రసాద్, కల్పన, సుదర్శనమ్మ, రామయ్య, కొండమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

మనుబోలు : మనుబోలు చెరువుకట్ట వద్ద వెలసిన గంగమ్మ పరమేశ్వరి ఆలయంలో గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ అమ్మవారికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ గావించారు. అనంతరం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమానికి గడ్డం శ్రీనివాసులురెడ్డి, లలితమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు రేపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు చేపడుతామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో కానుకల లెక్కింపు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు హాజరు కావాలని కోరారు.


ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న దళితులు

మనుబోలు : చెరువు భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జట్లకొండూరు పంచాయతీ జ్యోతినగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆక్రమణకు గురైన పొలాల వద్ద ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు చెరువు, శ్మశాన భూములను ఆక్రమించుకుని ఎస్సీలైన తమకు దారి లేకుండా చేశాడని తెలిపారు. ఈ విషయంపై ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం ఆధ్వర్యంలో ధర్నా చేసినా అధికారులు స్పందించలేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా



మినగల్లు నుంచి మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. మినగల్లు గ్రామంలో స్థానిక టీడీపీ నాయకులు దగ్గరుండి మరీ మట్టి తరలింపు చేపడుతున్నారు. మినగల్లు గ్రామం వద్ద పెన్నానది పొర్లుకట్టను ఇష్టారాజ్యంగా ప్రొక్లెయిన్లతో ధ్వంసం చేసి ట్రాక్టర్లు, టిప్పర్లకు మట్టి లోడు చేసి లేఅవుట్లు, నగర పంచాయతీలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షల నగదును వెనకేసుకుంటున్నారు. ప్రశ్నించినవారిపై 'ఏమి చేసుకుంటారో చేసుకోండి.. మట్టి తరలింపు ఆపేది లేదని' తెగేసి చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను చూసినా పట్టించుకోవడం లేదు. ఇలా వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ల వల్ల పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదమరిస్తే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తెలిసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

స్వచ్ఛభారత్ ప్రజలకేనా..?



ఏకేపీ కార్యాలయం వద్ద..




మండల రీసోర్స్ భవనానికి మూసుకుపోయిన మార్గం

- పిచ్చి మొక్కలకు ఆవాసంగా ప్రభుత్వ కార్యాలయాలు
- అడవిని తలపిస్తున్నా.. పట్టించుకోరా?

తోటపల్లిగూడూరు : పరిశుభ్రత, స్వచ్ఛభారత్‌పై ఉపదేశాలు ఇచ్చే ప్రభుత్వ అధికారులు.. వారు ఉండే కార్యాలయాల శుభ్రత గురించి మాత్రం అసలు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలతో అడవిని తలపిస్తున్నాయి. అయినా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ నినాదంతో గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామీణులు, స్థానిక యువతను చైతన్య వంతులు చేస్తూ ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా పరిశుభ్రత అంటూ తిరుగుతున్న అధికారులు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఐకేపీ, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలు పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారిపోయాయి. దీనివల్ల అధికారులతో పాటు నిత్యం ఆయా కార్యాలయాలకు పనుల మీద వెళ్లే ప్రజలకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు.



వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద..



పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం

నిమ్మకు గడ్డుకాలం

- పెరిగిన దిగుబడులు
- తగ్గిన ధరలు



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు : దసర నవరాత్రులు పూర్తయిన తర్వాత నిమ్మకాయల ధరలు పెరిగి తర్వాత తగ్గిపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు కిలో రూ.20 నుంచి రూ.35 వరకు ఉన్నాయి. రైతులకు ఎన్ని ఒడిదొడుకులు ఉన్నా నిమ్మతోటల సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. తగ్గిన ధరలు వచ్చే ఏడాది జనవరి ఆఖరు వరకు ఉండే అవకాశం ఉంటుందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. చలికాలంలో నిమ్మకాయల వినియోగం గణనీయంగా తగ్గుతుంది. అయితే గతేడాదితో పోల్చిచూస్తే వర్షాలు తక్కువగా ఉన్నాయి. నిమ్మవాడకం ఒక మోస్తరుగా ఉన్నా ధరలు దిగజారుతున్నాయి. నిమ్మతోటల్లో కాయల దిగుబడి పెరిగింది. అయితే ధరలు పతనం అవుతుండడం వల్ల రైతులకు ఇబ్బందిగా మారింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి కాయల ధరలు రైతులు ఆశించిన స్థాయిలో పెరిగే అవకాశం ఉంటుంది. మచ్చలు అధికంగా ఉండడం వల్ల కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతులు కాయలు కోసిన తర్వాత ప్రాథమిక జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల నాణ్యత దెబ్బతింటున్నట్లు తెలుస్తోంది. మంచుకు తడిసిన కాయలు కోసి ఇళ్లకు తీసుకొచ్చి తొడిమెలు తొలగించడం వల్ల కూడా కాయల నాణ్యత దెబ్బతింటున్నట్లుగా తెలుస్తోంది.

తెనాలి మార్కెట్ నుంచి అధిక ఎగుమతులు

పొదలకూరు, గూడూరు నిమ్మమార్కెట్ల నుంచే కాక తెనాలి నిమ్మ మార్కెట్ నుంచి ఎగుమతులు బాగా పెరిగాయి. ప్రతి రాష్ట్రానికి తెనాలి మార్కెట్ నుంచి కాయలు ఎగుమతి అవుతున్న నేపథ్యంలో డిమాండ్ తగ్గుతున్నట్లుగా తెలుస్తోంది. దీనికితోడు నిమ్మతోటల నుంచి కాయల దిగుబడి పెరిగింది. మార్కెట్లకు విపరీతంగా కాయలు వస్తుండడం వల్ల వ్యాపారులు ఎగుమతులు పెంచారు. అయితే చలికాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కాయలకు కొంతవరకు డిమాండ్ తగ్గుతుంది. ఫలితంగా ధరలు పతనం అవుతున్నట్లుగా తెలుస్తోంది.